
సాక్షి అనంతపురం

శనివారం । 20 । మే । 2023



చీనీ టన్ను రూ.41 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.41 వేలు పలికాయి.



టీబీ డ్యాంలో 3.907 టీఎంసీలు

టీబీ డ్యాంలో శుక్రవారం నాటికి 3.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటిమట్టం 1.578 అడుగులకు చేరుకుంది.

గరిష్ఠం/కనిష్ఠం

45.5°/24.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత పెరిగింది. నైరుతి దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

13 వేల క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్



విత్తన వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఆర్‌బీకే వేదికగా విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు చురుగ్గా సాగుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం నాటికి 15 వేల మంది రైతులు 13 వేల క్వింటాళ్లకు తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఈ నెల చివరి వారంలో పంపిణీ మొదలు పెట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాసెసింగ్‌ప్లాంట్లలో వేరుశనగ శుద్ధి చేసే కార్యక్రమం వేగవంతం చేశామని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే.ధనలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు 125 ఆర్‌బీకేలకు 8 వేల క్వింటాళ్లకు పైగా సరఫరా చేశామన్నారు. భూ విస్తీర్ణం బట్టి ఒక్కో రైతుకు గరిష్ఠంగా 40 శాతం రాయితీతో 90 కిలోలు పంపిణీ చేస్తామన్నారు. కే–6 రకం 30 కిలోల బస్తాకు రూ.1,674, కదిరి–లేపాక్షి 1812 రకం 30 కిలోల బస్తాకు రూ.1,494 ప్రకారం రైతులు చెల్లించాలని తెలిపారు.

రైతులకు అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్ గార్గ్, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి రైతులకు అండగా నిలవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ అందించాలని చెప్పారు. అవసరమైన ఎరువులు, పురుగుమందులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, డీఏఓ చంద్రానాయక్, పశు శాఖ జేడీ సుబ్రమణ్యం, మత్స్య శాఖ డీడీ శాంతి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏఎస్పీగా విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఎస్పీలు, డీఎస్పీలకు స్థానచలనం, పదోన్నతులు కల్పించింది. అనంతపురం అదనపు ఎస్పీ నాగేంద్రుడుని విశాఖ స్పెషల్ బ్రాంచ్ అదనపు డీసీపీగా బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ విజయభాస్కరరెడ్డికి పదోన్నతి కల్పిస్తూ అనంతపురం అదనపు ఎస్పీగా నియమించింది. ప్రకాశం జిల్లా డీటీసీ డీఎస్పీ జి.రామకృష్ణకు పదోన్నతి కల్పించి అనంతపురం సెబ్ అదనపు ఎస్పీగా నియమించారు. సెబ్ డీఎస్పీ విష్ణును పదోన్నతిపై శ్రీసత్యసాయి జిల్లా అదనపు ఎస్పీగా నియమించారు. అక్కడ పని చేస్తున్న కేఆర్ ప్రసాద్‌ను సెబ్ అదనపు ఎస్పీగా విజయవాడకు బదిలీ చేశారు.

ముగిసిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగజనార్దన

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్‌లో భాగంగా ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు సంబంధించిన ప్రవేశ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షకు మొత్తం 2,38,180 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 2,24,724 (94.35శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 136 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన తెలిపారు. ఇంజినీరింగ్ ప్రవేశపరీక్ష 9 సెషన్లలో నిర్వహించామన్నారు. శుక్రవారం శ్రీ రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ప్రొద్దుటూరు)లోని పరీక్ష కేంద్రాలను ఈఏపీసెట్ చైర్మన్ పరిశీలించారు.

ఆదమరిస్తే ఆహారమే విషం

- పెరుగుతున్న ఫుడ్ పాయిజనింగ్ కేసులు
- నిల్వ ఉంచిన ఆహారం వల్లే అనర్థాలు
- కల్తీ పదార్థాల దాడి కూడా ఎక్కువైంది
- ఫిర్యాదు చేస్తే హోటళ్లపై చర్యలు తీసుకుంటామన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు





సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోజూ ఇంట్లో తిని బోరు కొట్టింది.. కాస్త హోటల్ కెళ్లి తిందామన్న ఆలోచన అసలుకే మోసం తెస్తోంది. నోరూరించే వాసన, ఆకర్షించే రంగులు.. ఇంకేముంది చికెన్, మటన్, చేపలు కనిపిస్తే చాలు లొట్టలేసుకుంటూ తింటాం. బిర్యానీ ప్రేమికులు ఇంకాస్త ఎక్కువ. కానీ హోటల్‌లో తిన్న పాపానికి పొద్దున్నే ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. రోజురోజుకూ ఫుడ్ పాయిజనింగ్ (విషాహారం) కేసులు నమోదవుతూనే ఉన్నాయి. హోటళ్లలో వాడుతున్న నాసిరకం ఆహార పదార్థాల ముడిసరుకులు, అపరిశుభ్ర వాతావరణం, సరైన నీళ్లు వాడకపోవడం, ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన పదార్థాలు వండటం వంటి కారణాలతో ఫుడ్ పాయిజనింగ్ కేసులు తీవ్రమవుతున్నాయి.

నియంత్రణ ఎక్కడా కనిపించలేదు

హోటళ్లలో వండుతున్న ఆహారంపై నియంత్రణే లేదు. ప్రధానంగా మాసాహారం...చికెన్, మటన్, చేపలు, రొయ్యలు వంటి పదార్థాలు నాలుగైదు రోజులు కూడా నిల్వ ఉంచి వినియోగదారులకు పెడుతున్నారు. దీనివల్ల వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. చిన్న చిన్న బడ్డీ కొట్లు అటుంచితే... ఓ మోస్తరు మెస్‌లు, రెస్టారెంట్‌లకు కూడా లైసెన్సులు లేని పరిస్థితి. ఏళ్ల తరబడి అవి అలా కొనసాగుతున్నా పట్టణాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చూసీచూడనట్టు వెళుతున్నారు. ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదు. ఇక రోడ్ల మీద అమ్మే ఆహారం కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది.

విషాహారానికి ప్రధాన కారణాలు ఇవే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విషాహారం తిని ఆస్పత్రిపాలవుతున్న కేసులు తరచూ జరుగుతున్నాయి. వీటిలో ప్రధానంగా...

- ఆహార పదార్థాలను సరిగా శుభ్రయం చేయకుండా వినియోగించడం
- సరైన మోతాదులో ఉడికించకపోవడం
- మాంసాహారాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం
- వాడిన నూనెలు మళ్లీ మళ్లీ వినియోగించడం
- ఆకర్షణ కోసం రకరకాల రంగులు వేసి వడ్డించడం
- బాగా చల్లారిపోయిన పదార్థాలను వడ్డించడం
- ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన చీజ్, బటర్‌లలో బ్యాక్టీరియా ఉండటం
- కలుషిత నీళ్లు వాడడం ద్వారా ఎక్కువగా బ్యాక్టీరియా వచ్చే అవకాశం ఉంది

టీపీసీ టెస్టింగ్‌లో ఫెయిలైతే కేసులు



టీపీసీ (టోటల్ పోలార్ కౌంట్)లో ఫెయిలైతే తక్షణమే అలాంటి హోటళ్లపై చర్యలు తీసుకుంటున్నాం. అంటే పదే పదే కాచిన నూనెలకు ఈ టీపీసీ టెస్టింగ్ ఉంటుంది. ఈ కౌంట్ 25కు మించితే చర్యలుంటాయి. గడిచిన రెండు మాసాల్లోనే నాలుగు హోటళ్లపై కేసులు నమోదు చేశాం. హోటళ్లపై ఎలాంటి ఫిర్యాదులున్నా ఫుడ్‌సేఫ్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.

– చక్రవర్తి, ఫుడ్‌సేఫ్టీ అధికారి, అనంతపురం

నిల్వ ఆహారంతోనే సమస్య



ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహారంతోనే ప్రధాన సమస్య. ఈ ఆహారంలో రకరకాల బ్యాక్టీరియా చేరి ఫుడ్‌పాయిజన్ అవుతుంది. ఇలాంటి లక్షణాలు కనిపించగానే డాక్టరును సంప్రదించడం, లేదా ఎక్కువగా కొబ్బరి నీళ్లు, స్వచ్ఛమైన మంచినీళ్లు తాగాలి. ఎక్కువగా ఫుడ్‌పాయిజనింగ్ ప్రభావం చిన్న పిల్లల్లో వస్తుంది.

–డా.ఫణి మహేశ్వరరెడ్డి, జనరల్ సర్జన్, అనంతపురం

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- మాంసాహారం గానీ, కూరగాయలు గానీ ఎక్కువ సేపు ఉడికించి తినాలి
- వీలైనంత వరకూ నిల్వ ఉంచకుండా ఏరోజు ఆహారం ఆరోజే తినాలి
- కాచి చల్లార్చిన నీళ్లను తాగడం మంచిది
- ఒకసారి వేడిచేసిన నూనెలు మళ్లీ మళ్లీ వాడకుండా చూసుకోవాలి
- ప్రధానంగా మాంసాహారం అప్పటికప్పుడు తినడం మంచిది
- పురుగు మందుల వాడకం ఎక్కువైన నేపథ్యంలో ఆకుకూరలు గానీ, కూరగాయలు గానీ వేడినీటిలో ఉప్పువేసి అరగంట సేపు నానబెట్టాక వండటం
- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించగానే ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) పౌడర్ నీళ్లలో కలిపి తాగడం
- కాచి చల్లార్చిన నీళ్లు ఎక్కువ మోతాదులో తీసుకోవడం..కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవడం



హోటళ్ల వివరాలు

అనంతపురం జిల్లాలో హోటళ్లు	500 పైనే
లైసెన్సు ఉన్నవి	200
శ్రీసత్యసాయి జిల్లాలో హోటళ్లు	350 పైనే
లైసెన్సు ఉన్నవి	150
చిన్న చిన్న బడ్డీ కొట్లు	2000 పైనే
రెండు మాసాల్లో ఉమ్మడి జిల్లాలో నమోదైన కేసులు	8

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా



పోలీసులకు సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

కళ్యాణదుర్గం: డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి శుక్రవారం కళ్యాణదుర్గంలో పర్యటించారు. పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. చోరీలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం పలు ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు సూచనలిచ్చారు. డీఐజీ వెంట డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు తేజమూర్తి, శ్రీనివాసులు, ఎస్ఐలు నాగమధు, ఆశాబేగం, సుధాకర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో అడ్మిషన్లు చేయొద్దు

రాప్తాడు రూరల్: ప్రైవేట్ విద్యా సంస్థలు సెలవుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్మిషన్లు చేయరాదని డీఈఓ సాయిరామ్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సురేష్‌బాబు స్పష్టం చేశారు. శుక్రవారం అనంతపురంలోని కేఎస్‌ఆర్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ, ఆర్ఐఓ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. పిల్లలకు ఒత్తిడి కలిగించకుండా బోధన చేయాలని సూచించారు. విద్యా సంస్థలు పునఃప్రారంభమైన తర్వాత ప్రభుత్వ నిబంధనలకు లోబడి అడ్మిషన్లు చేయాలన్నారు. విద్యా సంస్థల పేర్లతో ముద్రించిన పుస్తకాలను విక్రయించరాదన్నారు. పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచితంగా అడ్మిషన్లు కల్పించే విషయంలో 12–1(సీ) ప్రకారం కేటాయించిన విద్యార్థులను అడ్మిషన్లు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీవీఈఓ వెంకటరమణ నాయక్, డీవీఈఓలు పద్మప్రియ, శంకరప్రసాద్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, ఎంఈఓ వెంకటస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

- గ్రామస్వరాజ్యం సాకారం దిశగా అడుగులు
- సచివాలయ వ్యవస్థ జగన్ మానస పుత్రిక
- 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో వక్తలు



వలంటీర్ ఈశ్వరిని సన్మానిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, తదితరులు

అనంతపురం సిటీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హుల దరిచేర్చడానికి వలంటీర్లు వారధులుగా పనిచేస్తున్నారని వక్తలు కొనియాడారు. అవినీతి, బంధుప్రీతికి తావులేకుండా సేవలందిస్తూ దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించారని పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు శుక్రవారం అనంతపురంలోని కృష్ణ కళామందిరంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చేతల మీదుగా మూడు కేటగిరీల్లో ఎంపికైన వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. జిల్లా వ్యాప్తంగా 10,069 మంది గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లను సేవా వజ్ర (రూ.30 వేలు), సేవారత్న (రూ.20 వేలు), సేవా మిత్ర (రూ.10 వేలు) అవార్డులకు ఎంపిక చేశారు. వీరి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు రూ.10.34 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 36 మందికి సేవావజ్ర, 199 మందికి సేవారత్న, 9,834 మందికి సేవామిత్ర పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే క్రమంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి దేశ వ్యాప్త దృష్టిని ఆకర్షించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. సంక్షేమ పథకాల ఫలాలను పేదలకు చేర్చే అవకాశాన్ని వలంటీర్లకు కల్పించడం గొప్ప నిర్ణయమని తెలిపారు. సచివాలయ వ్యవస్థను తన మానస పుత్రికగా భావిస్తున్న సీఎం జగన్.. వలంటీర్లను సైనికులుగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. అవినీతికి, బంధుప్రీతికి తావులేని వ్యవస్థగా వలంటీర్ల వ్యవస్థను అన్ని రాష్ట్రాలూ కొనియాడుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. కోవిడ్, వరదలు వంటి విపత్తుల సమయంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు సేవలందించారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను సకాలంలో అర్హులకు అందించే సామాజిక బాధ్యతను భుజస్కందాలపై ఎత్తుకున్న వలంటీర్లు నీతి నిజాయతీకి మారుపేరుగా నిలుస్తున్నారని ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహమ్మద్ అన్నారు. జగనన్న సంకల్పానికి ప్రతిరూపాలైన వలంటీర్లందరూ వజ్రంతో సమానమేనని మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య పేర్కొన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రమణారెడ్డి, డీఎల్‌డీఓలు ఓబుళమ్మ, శంకర్ పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకండి



రౌడీషీటర్లు, గంజాయి విక్రేతలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో గౌరవంగా జీవించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం రౌడీషీటర్లు, గంజాయి విక్రేతలు, కిరాయి హంతకులకు అనంతపురంలో ఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. 'కూతురు పరాయి వాడిని ప్రేమించిందని అతడి ప్రాణం తీయించావ్...ఆ తప్పులో నీ కుమార్తె భాగస్వామికాదా? అతన్ని చంపించి ఏం మూట కట్టుకున్నావు? మానవత్వం ఎటుపోయింది.. నీ బిడ్డలాగే చనిపోయిన బిడ్డను మరో తల్లి కనలేదా? ఆ మాత్రం ఆలోచించలేకపోయావా?' అంటూ పరువు హత్యల కేసుల్లో నిందితులను ఎస్పీ ప్రశ్నిస్తుంటే.. ప్రాయశ్చిత్తంతో కన్నీరు కార్చి పాపాన్ని కడిగేసుకోలేని తప్పుచేశామన్న భావన నిందితుల్లో కనిపించింది. ఇక కిరాయి హంతకులు, రౌడీషీటర్లు, కీలక హత్య కేసుల్లోని నిందితులకూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. డబ్బుపై ఆశతో ఎన్నో కలలు కంటున్న యువత జీవితాలను పెడదారి పట్టించే గంజాయి విక్రయ ముఠాలకు తాట తీస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, డీఎస్పీలు ప్రసాదరెడ్డి, వెంకటశివారెడ్డి, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు..

గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలతో జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్న యువకులతో ఎస్పీ సమావేశమయ్యారు. వీరికి డీ అడిక్షన్ సెంటర్ వైద్యులతో కలసి పోలీసు పరేడ్ మైదానంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉన్నత చదువులు చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సింది పోయి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ స్మగ్లింగ్‌తో పాటు వినియోగించడం కూడా నేరమే అన్నారు. మాదక ద్రవ్యాల రహిత అనంతగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంత మంచి సంకల్పానికి యువత బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సర్వజనాస్పత్రి ప్రొఫెసర్ వైద్యనాథ్, అసోసియేట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వరదరాజులు, డీ అడిక్షన్ సెంటర్ సైకియాట్రిస్టు శశాంక పాల్గొన్నారు.

శిక్షల శాతం పెరిగితే నేరాలు తగ్గుముఖం

తాడిపత్రి అర్బన్: శిక్షల శాతం పెరిగితే నేరాలు తగ్గుముఖం పడతాయని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయ వ్యవస్థ, పోలీసు శాఖ సమన్వయంతోనే ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కోర్టు ట్రయల్స్‌లో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు డివిజన్ పరిధిలోని పోలీసులకు శుక్రవారం తాడిపత్రి ఏఎస్ఆర్ ఫంక్షన్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నేరాలకు సంబంధించి ముద్దాయిలకు శిక్షలు పడడానికి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచాలని, ట్రయిల్ టెక్నికల్ ఎవిడెన్స్ బాగా ఉపయోగించి సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. కానిస్టేబుళ్లు నిబద్ధతతో పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని కోరారు.

'జగనన్న ఆణిముత్యాల' జాబితా సిద్ధం

- పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో ఒక విద్యార్థి ఎంపిక
- జిల్లాస్థాయిలో పదో తరగతిలో 23 మంది, ఇంటర్‌లో 18 మంది
- నియోజకవర్గస్థాయిలో టెన్త్‌లో 30 మంది, ఇంటర్‌లో 36 మంది
- 25న నియోజకవర్గస్థాయి, 27న జిల్లా స్థాయిలో అవార్డుల ప్రదానం

రాప్తాడు రూరల్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న ఆణిముత్యాలు'కు సంబంధించిన జాబితా సిద్ధమైంది. శుక్రవారం రాష్ట్ర అధికారుల నుంచి జిల్లా అధికారులకు జాబితా చేరింది. పదో తరగతి విద్యార్థి ఒకరు రాష్ట్రస్థాయి తృతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. బి.పప్పూరు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి బి.మధుసూదన్ 583 మార్కులు సాధించాడు. 31న రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మధుసూదన్ నగదు పురస్కారం అందుకోనున్నాడు.

జిల్లాస్థాయి అవార్డులకు..

జిల్లాస్థాయి అవార్డులకు పదో తరగతిలో 23 మంది ఎంపికయ్యారు. వీరిలో ఏడుగురు మొదటి బహుమతి, ఎనిమిది మంది రెండో బహుమతి, మరో ఎనిమిది మంది తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. ఇంటర్‌లో జిల్లాస్థాయి అవార్డులకు 18 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ నెల 27న జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమంలో ఈ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేయనున్నారు.

నియోజకవర్గస్థాయి అవార్డులకు..

నియోజకవర్గస్థాయి అవార్డులకు పదో తరగతిలో 30 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. 8 నియోజకవర్గాలకు సంబంధించి ముగ్గురు చొప్పున 24 మందిని ఎంపిక చేసినా.. సమాన మార్కులు వచ్చిన మరో ఆరుగురిని అదనంగా ఎంపిక చేశారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నియోజకవర్గస్థాయిలో 36 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 25న నియోజకవర్గస్థాయి అవార్డులు అందజేయనున్నారు. నియోజకవర్గ, జిల్లాస్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, డీవీఈఓ వెంకటరమణనాయక్ తెలిపారు.

భానుడు.. దూకుడు

- 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు



నిర్మానుష్యంగా ఉన్న అనంతపురం కోర్టు రోడ్డు

అనంతపురం అగ్రికల్చర్: ఎండలు భగ్గుమంటున్నాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. శుక్రవారం రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో ఏకంగా 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు కావడం గమనార్హం. యల్లనూరు 43.8 డిగ్రీలు, గుమ్మఘట్ట 43.3, పుట్లూరు 43.1, యాడికి 43, తాడిపత్రి 42.9, నార్పల 42.8, రాప్తాడు 42.7, పెద్దవడుగూరు 42.6, పెద్దపప్పూరు, రాప్తాడు, శింగనమల 42.6, బొమ్మనహాళ్, గుత్తి 42.5, పామిడి 42.3, శెట్టూరు 42.2 డిగ్రీల మేర గరిష్ఠంగా నమోదయ్యాయి. జిల్లా అంతటా సగటున 42 డిగ్రీలతో అట్టుడికిపోయింది.

- శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఎండల తీవ్రత పెరిగిపోయింది. తాడిమర్రిలో అత్యధికంగా 43.2 డిగ్రీలు నమోదు కాగా.. మిగతా మండలాల్లో 40 నుంచి 43 డిగ్రీల మధ్య రికార్డయ్యింది. ఉదయం 9 గంటలకే సూర్యుడు సెగలు కక్కుతుండటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నీడ, నీళ్ల కోసం జనం ఎగబడుతున్నారు. గాలిలో తేమ ఉదయం 50 నుంచి 60 శాతం ఉండగా, మధ్యాహ్న సమయానికి 20 నుంచి 25 శాతానికి పడిపోయింది. 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న వడగాల్పులతో శుక్రవారం 'డ్రై'డేగా మారిపోయింది. జనం బయటకు రావడానికి భయపడిపోయారు.

క్లుప్తంగా

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: రాష్ట్ర మహిళలకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. అమరావతిలో పేద మహిళల పేరిట ఇస్తున్న సెంటు ఇళ్ల స్థలాల్లో సమాధులు కట్టుకోవాలని చంద్రబాబు మాట్లాడటం దారుణమన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో చంద్రబాబు తీవ్ర ఒత్తిడికి గురయ్యారని చెప్పారు. మహిళా ద్రోహి అయిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో మహిళలంతా బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాలు మహిళల పేరిట ఇస్తున్నామని తెలిపారు. మహిళలను చంద్రబాబు హీనంగా మాట్లాడటం దారుణమన్నారు. 2014లో చంద్రబాబు దాదాపు 24 లక్షల ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట తప్పారని గుర్తుచేశారు.

సొసైటీల ద్వారా మెరుగైన సేవలు

- డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత



మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీల) ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. శుక్రవారం స్థానిక డీసీసీబీ హాలులో కంప్యూటరీకరణ అంశంపై పీఏసీఎస్ సీఈఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాబార్డు, ఆప్కాబ్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సొసైటీల్లో కంప్యూటరీకరణ పూర్తి దశకు వచ్చిందన్నారు. త్వరలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుండటంతో రైతులకు పారదర్శకమైన సేవలు అందిస్తామన్నారు. సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, ఆప్కాబ్ అధికారి కె.వి జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలోనే కొలువు

- దన్నుగా నిలుస్తున్న అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం
- బీటెక్, పీజీ పూర్తి చేసిన వారికి క్యాంపస్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం
- వర్సిటీలు, జిల్లాకు చెందిన గ్రామీణ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత
- ఇప్పటికే 50 మందికి ఉద్యోగ కల్పన
- 1,500 మందికి సాఫ్ట్‌వేర్ కొలువులు కల్పించేలా చర్యలు
- క్యాంపస్‌లోనే ఉద్యోగాలు కల్పించే వర్సిటీగా ఎస్కేయూకు ప్రత్యేక గుర్తింపు



అమెరికన్ రిక్రూటింగ్ ప్లాట్‌ఫాంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం విద్యార్థులకు దన్నుగా నిలుస్తోంది. ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగడానికి చేయూతనివ్వడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారుకావడానికి దోహదపడుతోంది. కొత్త ఆలోచనతో వస్తే ఆవిష్కరణ దిశగా తీసుకెళ్లేంత వరకు చేయూతనిస్తోంది. ఇందులో ఇప్పటికే 21 స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. తద్వారా ఉద్యోగాలు కల్పించే వేదికగానూ రూపుదిద్దుకుంది. అగ్రికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిసిటీ అండ్ రెనెవబుల్ ఎనర్జీ, ఐసీటీ అండ్ ఐఓటీ సొల్యూషన్స్ విభాగాల్లో స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. హెలెన్‌బైక్స్, ఆర్, సుచంద్ర టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అజిరా పవర్, వెబ్సికా డేటా సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ , అవాన్ టెక్, టెక్నోహబ్, ప్రవీణ్ ఫుడ్ టెక్, బెర్రిస్, అర్బర్ నేచర్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి కంపెనీలు ఇందులో పాలుపంచుకుంటున్నాయి. ఇందులో నమోదైన సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎస్కేయూ విద్యార్థులకు కొలువుల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపట్టారు.

భారీఎత్తున ఉద్యోగ కల్పన దిశగా..

అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో స్టార్టప్‌లతో పాటు ఏడాదికి రూ.800 కోట్ల టర్నోవర్ కలిగిన అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్ కంపెనీ నూతన పరిశోధనలు, ఆవిష్కరణలకు సంబంధించి నమోదు చేసుకుంది. ఈ కంపెనీ అమెరికన్ రిక్రూటింగ్, టెస్టింగ్ టూల్స్ ప్లాట్‌ఫాంల మీద ఎస్కే యూనివర్సిటీలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తోంది. ఇప్పటికే 50 మందిని నియమించుకుంది. ఇందులో సింహభాగం ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురంలో బీటెక్ పూర్తి చేసిన వారే. ఈ యూనివర్సిటీల్లో బీటెక్, పీజీ చదివే విద్యార్థులతో పాటు జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించే ప్రధాన ఉద్దేశంతో ఇంక్యుబేషన్ కేంద్రంలోనే కంపెనీ ఏర్పాటు చేశారు. వర్సిటీలో ఇలా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయడం రాష్ట్రంలోనే తొలిసారి కావడం విశేషం.

జన్మభూమి రుణం తీర్చుకోవాలని..



నేను అనంతపురంలోనే చదువుకున్నా. జన్మభూమి రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడ కంపెనీ శాఖ ప్రారంభించాం. అంతర్జాతీయ స్థాయిలో టాప్-500 కంపెనీల్లో అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ ఒకటి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దన్నుగా నిలవాలనే ఉద్దేశంతో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఎంపిక చేసుకున్నాం. బీటెక్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు మెట్రో సిటీలకు వెళ్లి ఉద్యోగాలు వెతుక్కునే అవసరం లేకుండా వారు చదివిన ప్రాంతంలోనే అవకాశాలు కల్పిస్తున్నాం.

– రాజ్ చప్పిడి, అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ (ఏజీఎస్), సీఈఓ కమ్ ఫౌండర్

ఇక్కడ మొత్తం 1,500 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రాత్రి పూట విధులు నిర్వర్తించే వారికి క్యాబ్‌లు, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక భద్రత సైతం ఏర్పాటు చేస్తున్నారు.

1,500 మందికి ఉద్యోగాలిస్తాం



మా కంపెనీలో ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురంలో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తాం. భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అలవరచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఇందుకోసం తొలుత నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నాం. 1,500 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తున్నాం.

–దామోదర్ జే, వైస్ ప్రెసిడెంట్, అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్

ఇక్కడే ఉద్యోగం లభించడం సంతోషంగా ఉంది



జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని మోహన్‌బాబు ఇంజినీరింగ్ కళాశాలలో 2021లో బీటెక్ పూర్తిచేశా. దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయాలంటే ఇబ్బంది. అనంతపురంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కల్పించారు. ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్నా. ట్రైనింగ్‌లోనే నెలకు రూ.15 వేల వేతనం ఇస్తున్నారు. మంచి ప్లాట్‌ఫాం దొరికినందుకు ఆనందంగా ఉంది.

– ప్రశాంత్, అనంతపురం.

అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి



వర్సిటీలోని ఇంక్యుబేషన్ కేంద్రంలో స్టార్టప్‌లతో పాటు పేరెన్నిక గల కంపెనీలు సైతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో అవకాశాలను ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ గ్రాడ్యుయేట్లు అందిపుచ్చుకోవాలి. ఇంక్యుబేషన్ కేంద్రం పనితీరు అద్భుతంగా ఉంది. స్వయాన కేంద్ర ప్రణాళికా శాఖ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ గతేడాది డిసెంబర్ 11న పార్లమెంట్‌లోనే ప్రశంసించారు. ఈ కేంద్రానికి మూడు అంతర్జాతీయ స్థాయి అవార్డులు కూడా దక్కడం వర్సిటీకే గర్వకారణం.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వైస్ చాన్సలర్, ఎస్కేయూ

డీసీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ

పామిడి: పట్టణ కమ్యూనిటీ ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణవేణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల 30 డెలివరీలు అయ్యేలా చూడాలని వైద్యురాలు శారదకు సూచించారు. ఆరోగ్యశ్రీ డెలివరీలు, ఆసరా పథకం వర్తింపుపై ఆమె, ఆరోగ్య మిత్ర బాబుతో సమీక్షించారు. ఇప్పటి వరకూ ఆరోగ్యశ్రీ కింద 325 డెలివరీ కేసులు నమోదు చేసి, ఆసరా కింద రూ.5 వేలు సైతం అందజేశామన్నారు. అలాగే జనరల్ సర్జరీ, పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్ కేసులు సైతం ఆరోగ్యశ్రీ కింద వర్తింపజేశామన్నారు. దీనికిగాను ఆరోగ్యమిత్రను ఆమె అభినందించారు.

గుత్తి కోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుత్తి: గుత్తి కోటలోని దిడ్డి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమేష్ నాయక్ ,పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కను పురుగుల మందు డబ్బా ఉంది. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి పురుగుల మందు డబ్బా అక్కడ ఉంచారా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు డాక్టర్‌ను అక్కడికే పిలిపించి పోస్టు మార్టం చేయించారు. మృతదేహాన్ని ఖననం చేశారు.

మల్లారెడ్డికి జాతీయస్థాయి అవార్డు

- నేషనల్ వాటర్ అవార్డు ప్రకటించిన కేంద్రం



అనంతపురం అగ్రికల్చర్: ఇప్పటికే పలు అవార్డులు, రివార్డులు సాధించిన స్థానిక ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు డాక్టర్ వైవీ మల్లారెడ్డి మరో ప్రతిష్టాత్మకమైన పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ రీసోర్స్ రివర్ డెవలప్‌మెంట్ అండ్ గంగా రిజున్వేషన్ శాఖ సెక్రటరీ ఫంకజ్‌కుమార్ నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. నేల, నీటి సంరక్షణ, కరువు నివారణ చర్యలు చేపట్టడంతో విశేష కృషి చేస్తూ రైతులకు విశిష్ట సేవలందిస్తున్నందున రాష్ట్రంలోనే 'బెస్ట్ ఎన్‌జీఓ'గా గుర్తించినట్లు పేర్కొన్నారు. నేషనల్ వాటర్ అవార్డు–2022 కింద స్పెషల్ కన్సలేషన్ అవార్డుకు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డిని ఎంపిక చేశామన్నారు. అవార్డు కింద ట్రోఫీ, ప్రశంసాపత్రం, నగదు పురస్కారం త్వరలోనే ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. దీనిపై డాక్టర్ వైవీ మల్లారెడ్డి స్పందిస్తూ... కరువు పీడిత 'అనంత'లో రైతులు, పేద వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అవార్డు ప్రకటించడం సంతోషమని, ఇది మరింత బాధ్యత పెంచినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లలో శుక్రవారం బ్యాళ్ల రత్నమ్మ (28) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు... పెనకచెర్లకు చెందిన బ్యాళ్ల రత్నమ్మ (28) అనే మహిళ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న నయం కాక పోవడంతో మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

- సిబ్బందితో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రతి పోలీసు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ కె. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఏ.ఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ, అనంతపురం, అనంతపురం రూరల్ పరిధిలోని పోలీసులతో పరేడ్‌ను నిర్వహించారు. ఈ పరేడ్‌ను జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆరోగ్యం మెరుగుకు ప్రతీరోజూ వ్యాయామం తప్పనిసరన్నారు. జిల్లా పోలీసు ఆసుపత్రిలో ఇ.సీ.జీ మిషన్ అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసులకు తక్కువ ధరలతో అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు చేయించేలా త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. కష్టంతో కాకుండా విధులను ఇష్టంతో చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. అసాంఘిక శక్తులతో ఎట్టిపరిస్థితులలో సంబంధాలు పెట్టుకోవద్దన్నారు. మన వద్దకు వచ్చే పిటీషనర్లు, ఇతర ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. విధులతో పాటు ఇతర సమస్యలు ఏవైనా పారదర్శకంగా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బాగా పని చేసిన వారికి ప్రశంసలు... తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతపురం,అనంతపురం రూరల్ సబ్ డివిజన్ల సిబ్బంది, ఏ.ఆర్, స్పెషల్ పార్టీ, హోంగార్డులతో నేరుగా ఎస్పీ మాట్లాడారు. విధుల్లో ఆరోగ్య, విద్య, తదితర అంశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, డీఎస్పీలు ఎం.ఆంథోనప్ప, జి.ప్రసాదరెడ్డి, బి.వి.శివారెడ్డి, శ్రీనివాసులు, రెండు సబ్ డివిజన్ల సి.ఐ లు, ఎస్ఐలు, పలువురు ఆర్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు పాల్గొన్నారు.

రాష్ట్ర జూడో జట్ల ఎంపిక



రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు


కళ్యాణదుర్గం: 66వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల జూడో చాంపియన్‌షిప్ అండర్ -19 ఎంపిక పోటీలు స్థానిక జ్ఞానభారతి ప్రైవేట్ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం జరిగాయి. అనంతపురం జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో చిత్తూరు బాల బాలికల జట్లు నిలిచాయి. కళ్యాణదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు, జూడో అసోసియేషన్ సీఈఓ బాబు, కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జూడో జట్లను ఎంపిక చేశారు. జూన్ 10 నుంచి 13 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

బాలుర జట్టు : కె.చందు (అనంతపురం, కె.విశాంత్ కుమార్ (శ్రీకాకుళం, కె.పవన్ కుమార్ (శ్రీకాకుళం), ఈ. సంతోష్ (అనంతపురం), ఓ.పుల్లారెడ్డి (అనంతపురం), జి.విష్ణు (అనంతపురం), డి.విష్ణు వర్ధన్ (అనంతపురం), వై శివసాయి (చిత్తూరు), ఎస్.యశ్వంత్ ప్రసాద్ (శ్రీకాకుళం).

బాలికల జట్టు : సి.నిఖిత (అనంతపురం), కె.సౌమ్య రాణి (శ్రీకాకుళం), పి.పార్వతి భాయి (అనంతపురం), పి.అలేఖ్య (వెస్ట్ గోదావరి), కె.మహిత (అనంతపురం), బి.అక్షయ (అనంతపురం), ఎస్.పూజిత భాయి (అనంతపురం), బి.రాములమ్మ (కర్నూల్), జి.హారిక (అనంతపురం), వై.శ్రీనిత్య (అనంతపురం).

రేపు పీఆర్ ఇంజినీర్ల రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం

- జెడ్పీ ఆవరణలో భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అనంతపురంలో ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి సమీక్షించారు. ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్, జనరల్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాగేంద్రకుమార్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మధుప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పీఆర్ ఇంజినీర్ల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ మద్దిలేటి, డీఈఈ గురుమూర్తి, ఏఈఈ వరప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణం నాయుడు, ప్రధాన కార్యదర్శి సంగీతరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్న దృష్ట్యా ఏర్పాట్లలో ఎక్కడా లోపం ఉండకూడదని భాస్కర్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్టర్ల ఒత్తిళ్లు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి సానుకూల వాతావరణంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని చర్చించారు. ఆర్థికపర ఇబ్బందులు ఉన్నా.. ప్రభుత్వం తన పరిధిలో శక్తికి మించి సాయం చేస్తోందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంతో స్నేహపూర్వక వాతావరణంలోనే సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేద్దామని ప్రతినిధులు నిర్ణయించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు ఈ ఏడాది 12,500 హెక్టార్లు లక్ష్యంగా డ్రిప్, స్ప్రింక్లర్లు పరికరాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు ఏపీఎంఐపీ జిల్లా అధికారి జి.ఫిరోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రిప్ కంపెనీల్లో ఫిట్టర్స్ కొరత ఉన్నందున నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. పదో తరగతి పాసైన వారు ఈనెల 29లోపు స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. వివరాలకు ఏపీఎంఐపీ డేటా ఎంట్రీ ఆపరేటర్ హరి (79950 10104)ని సంప్రదించాలని సూచించారు.

అన్నీ అబద్ధాలే !

- బిల్డింగ్ పూర్తికాకనే ఆస్పత్రి ఏర్పాటు చేసినట్లు దరఖాస్తు
- డీఎంహెచ్ఓ, డీఐఓ తనిఖీలో లక్ష్మీకాంతమ్మ మోసాలు వెలుగులోకి..



నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించేందుకు వెళ్లిన డీఎంహెచ్ఓ వీరబ్బాయి, డీఐఓ యుగంధర్

అనంతపురం క్రైం: రూత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ అనుమతుల కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ పాల్పడ్డ అక్రమాలు రోజుకోకటి వెలుగు చూస్తున్నాయి. ఆరోగ్యశాఖ అనుమతులు లేకుండా శ్రీనివాస్‌నగర్‌లో రూత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పేరిట ఆస్పత్రి నిర్వహణ జరుగుతున్న విషయం రెండ్రోజుల క్రితం వెలుగు చూసిన విషయం విదితమే. తాజాగా ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి మరో అడ్డగోలు బాగోతం వెలుగు చూసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీకాంతమ్మ ఆస్పత్రి నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్న చిరునామా తపోవనం (డోర్ నెంబర్ 3-812-1) వద్ద ఉన్న జీప్లస్ 4 భవనం వద్దకు శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డెమో బృందం వెళ్లగా అక్కడ విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. భవనంలోని ప్రతి ఫ్లోర్‌ను అధికారులు ఓపిగ్గా వెళ్లి చూశారు. భవనం నిర్మాణం పూర్తీకాకుండానే అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ ఈ ఏడాది ఏప్రిల్ 11న ఆన్‌లైన్‌లో ఆస్పత్రికి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా దరఖాస్తులో ఆస్పత్రి నిర్మాణం పూర్తయినట్లు, మంచాలను ఏర్పాటు చేసినట్లు పొందుపర్చారు. కానీ అక్కడ సిమెంట్ ప్లాస్టింగ్, తదితర పనులు చేయాల్సి ఉన్నట్లు అధికారులు తెలుసుకున్నారు.

చర్యలకు సిద్ధం

ధర్మవరం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత (25) మృతికి సంబంధించి త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో పీసీపీఎన్‌టీడీ యాక్ట్ ఉల్లంఘించారన్న కోణంగా ఆరోగ్యశాఖాధికారులు లోతుగా విచారణ చేపట్టారు. శుక్రవారం ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో త్యాగరాజు, తదితరులు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ ప్రతిని తీసుకున్నట్లు తెలిసింది. గతంలో ఆరోగ్యశాఖాధికారులు నమోదు చేసిన తప్పిదాలు, ప్రస్తుత పరిణామాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నారు. మరో రెండ్రోజుల్లో కలెక్టర్ గౌతమికి ఆరోగ్యశాఖాధికారులు నివేదిక సమర్పించనున్నారు.

సెలవులో లక్ష్మీకాంతమ్మ

ఈ నెల 16 నుంచి 18 వరకు మూడ్రోజుల పాటు సెలవులో వెళ్లిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ... ఈ నెల 19 నుంచి వచ్చే నెల 19 వరకు నెల రోజుల పాటు ఎర్న్ లీవ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

వీఆర్‌కు ఇద్దరు సీఐలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో ఇద్దరు సీఐలను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జాకీర్ హుస్సేన్, యాడికి సీఐ రామకృష్ణను వీఆర్‌కు పంపించారు. వీరి స్థానాలకు ఆర్.ప్రతాప్‌రెడ్డి (నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్), సి.శంకర్‌రెడ్డి (యాడికి)ని అటాచ్‌మెంట్ చేశారు.

పోలీసుల అదుపులో ట్రాన్స్‌కో ఏఈ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రైతులకు పరిహారం చెల్లింపు విషయంలో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్‌ను అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.30 లక్షల చేతివాటం ప్రదర్శించినట్లు వచ్చిన ఆరోపణలపై ఏఈని విచారణ చేస్తున్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో పీర్ కమిటీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) పీర్ కమిటీ శుక్రవారం పలు విభాగాలను సందర్శించింది. ఆదివారం వరకు పరిశీలన కొనసాగనుంది. వాస్తవానికి సివిల్, కెమికల్ విభాగాలకు సంబంధించి ఎన్‌బీఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేశారు.

అయినప్పటికీ కామన్‌గా ఉండే కళాశాల లైబ్రరీ, సైన్స్ బ్లాక్, ప్లేస్‌మెంట్ సెల్, సెంట్రల్ కంప్యూటర్ సెంటర్, డిస్పెన్సరీ, హాస్టళ్లు, లెక్చర్ హాల్ కాంప్లెక్స్, ప్లే గ్రౌండ్ తదితర అంశాలను పీర్ కమిటీ సభ్యులు పరిశీలించారు. సివిల్ విభాగంలో కొంత మంది సభ్యులు, కెమికల్ విభాగంలో కొంత మంది సభ్యులు వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవాని, కెమికల్ విభాగాధిపతి డాక్టర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బీమా డబ్బు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: నగరంలోని రహమత్‌నగర్‌కు చెందిన తిరుమలరెడ్డి అనే వ్యక్తి ఈ నెల 18న అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌బీమా తక్షణ సాయం కింద ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ సుకేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు తండాలో వైద్యసిబ్బంది జ్వరాలపై శుక్రవారం ఇంటింటా సర్వే చేశారు. ప్రతి ఇంటి వద్ద నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లార్వాను వెతికి, నీటి నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావనాన్ని పిచికారీ చేయించారు. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, మలేరియా ఉప విభాగం సూపర్‌వైజర్లు నూర్ బాషా, శేఖర్, ఏఎస్‌ఎంలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీరు సరఫరా



కుర్లపల్లిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: కుర్లపల్లి గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికుమార్, సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో కుర్లపల్లికి తాత్కాలికంగా నీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్లతో నీరు అందించారు. త్వరలోనే శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తెలిపారు. వేపచెర్ల గ్రామంలో కూడా నీటి సమస్య ఉండటంతో గ్రామంలో పైప్‌లైన్లు వేయించి, మోటారు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం అర్బన్: అనారోగ్యంతో మృతి చెందిన ఆటో కార్మికుడు రమేష్ కుటుంబానికి ఏఐటీయూసీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం రమేష్ కుటుంబ సభ్యులకు రూ.30 వేలు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఇతర నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నగర కార్యదర్శి కృష్ణుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై జరిమానా



జరిమానా విధిస్తున్న జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ నారాయణస్వామి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు పొగాకు ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులపై జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ నారాయణస్వామి జరిమానా విధించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి ఆదేశాలతో డాక్టర్ నారాయణస్వామి సర్వజనాస్పత్రి ఎదురుగా ఉన్న తోపుడు బండ్లను సోదా చేశారు. కొందరు పొగాకు విక్రయాలు చేపడుతున్నట్లు గుర్తించిన ఆయన.. అంగళ్ల నిర్వాహకులపై రూ.700 వరకు జరిమానా విధించారు. కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బీ శ్రీరాములు, ఎన్‌సీడీ కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

పామిడి: బాల్య వివాహాలు నిర్మూలిద్దామని ఐసీడీఎస్ పీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ సభాభవనంలో నిర్వహించిన బాల్యవివాహాల నిర్మూలన కమిటీ సమావేశంలో మాట్లాడారు. యువకులకు 21, యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రులతోపాటు సహకరించిన వారికి రెండేళ్ల జైలుతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి, గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఎంఈఓ జయానాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ, వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారూ..కళ్లు తెరవండి!

- అపరిశుభ్రతకు కేరాఫ్ ఎన్‌పీసీబీ యూనిట్
- శానిటేషన్ నిర్వహణపై నిర్లక్ష్యం
- ఇలాగే ఉంటే రోగుల కంటి చూపుపై ప్రభావం



యూనిట్‌లో కంటి శస్త్ర చికిత్స కోసం వచ్చిన వారు

అనంతపురం క్రైం: జేఎన్‌టీయూ రోడ్డు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న నేషనల్ ప్రోగ్రాం ఆఫ్ కంట్రోలింగ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) యూనిట్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇక్కడ నెలల తరబడి శానిటేషన్ నిర్వహణలేక కంటి శస్త్రచికిత్సలకు వచ్చే వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా ఇన్‌ఫెక్షన్ సోకితే రోగులకు కంటిచూపు పోయే ప్రమాదం లేకపోలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతోనే సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు పిల్లలు, వృద్ధులకు కంటి స్క్రీనింగ్ చేసి, సమస్యలున్న వారిని శస్త్రచికిత్సలకు పంపుతారు. వారంలో 30 నుంచి 40 మందికి శస్త్రచికిత్స నిర్వహిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ సైదన్న వారంలో మంగళవారం, శుక్రవారం రోజుల్లో కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి, ఇళ్లకు పంపుతారు. శస్త్ర చికిత్స నిర్వహించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సి ఉంది. యూనిట్ లోపలికి వెళ్లే ప్రాంతంతోపాటు ఆపరేషన్ థియేటర్ వరకు అపరిశుభ్రంగానే ఉంది. రోగులకు ఏర్పాటు చేసిన మంచాలపై బెడ్‌షీట్లు ఉండవు. అపరిశుభ్రంగా ఉన్న దిండు (పిల్లో), బెడ్‌లు కనిపిస్తాయి. గతంలో ఈ యూనిట్‌ను కోవిడ్ రోగులకు వినియోగించారు. అప్పట్లో కోవిడ్ రోగులకు వినియోగించిన పరుపులను యూనిట్‌లో రోగులకు వాడే డ్రగ్స్ పక్కనే పడేశారు. శానిటేషన్ నిర్వహణ సక్రమంగా లేక ఆస్పత్రిలో రోగులకు వినియోగించిన దూది, సిరంజీలు, తదితర వాటిని కాల్చి బూడిద చేయాల్సిన పరిస్థితి. బాత్‌రూంలు కూడా దారుణంగా ఉన్నాయి.

చేతులెత్తేసిన ఆస్పత్రి వైద్యాధికారులు..

వాస్తవంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ, వైద్య కళాశాల, కేన్సర్ యూనిట్, నర్సింగ్ కళాశాల శానిటేషన్ నిర్వహణ పరిధిలో ఉన్నాయి. ఎన్‌పీసీబీ యూనిట్‌ను సంబంధిత శానిటేషన్ నిర్వాహకుల పరిధిలోకి తీసుకొస్తే సమస్య ఉండదు. శానిటేషన్ సమస్యతో పాటు యూనిట్‌లో తాగునీటి సౌకర్యం, సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. వైద్యుడు, స్టాఫ్‌నర్సు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఓటీ అసిస్టెంట్, ఎంఎన్‌ఓ, డ్రైవర్ కొరత ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి ఎన్‌పీసీబీ యూనిట్ వస్తుందని ఆస్పత్రి వైద్యాధికారులు చేతులెత్తేశారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ కేసులు ఉండడంతోపాటు రోగులకు భోజనం, బెడ్‌షీట్లు క్లీన్ చేయడానికి ఆస్పత్రి ధోబీనే వస్తున్నారు. అలాంటప్పుడు శానిటేషన్, తదితర సౌకర్యాలు యూనిట్‌కు ఎందుకు ఏర్పాటు చేయరని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సివిల్ సర్జన్ స్పెషలిస్టు, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సైదన్న అంటున్నారు.



బాత్‌రూములు అధ్వానంగా ఉన్నాయని చెప్తున్న మహిళ

డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లాం

యూనిట్ పరిస్థితిని డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లా. సిబ్బందిని వారే ఏర్పాటు చేయాలి. ఇక శానిటేషన్ విషయానికి సంబంధించి అప్పుడప్పుడు ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే వారితోనే పనులు చేయించా. అయినా డాక్టర్ సైదన్న పూర్తి స్థాయిలో సౌకర్యాలు చూసుకొని సర్జరీలు చేయాల్సింది.

– డాక్టర్ రఘునందన్, సూపరింటెండెంట్, జీజీహెచ్

బెండ తోటల పరిశీలన

పెద్దపప్పూరు: దేవనుప్పలపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన బెండ తోటలను డివిజన్ ఉద్యాన వన శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఉద్యాన వన శాఖ అధికారులు హరినాథ్‌రెడ్డితో పాటు పలువురు బెండ తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు , సలహాలు ఇచ్చారు.

మద్యం స్వాధీనం

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో శుక్రవారం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన రంగస్వామి అరెస్ట్ చేసి 19 క్వార్టర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పోస్టర్ల విడుదల

కళ్యాణదుర్గం: ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో ఈనెల 26, 27న నిర్వహించే ఉజ్జీవ సువార్త స్వస్థత సభలను జయప్రదం చేయాలని కళ్యాణదుర్గం నియోజకవర్గ పాస్టర్ల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని పలు వీధుల్లో సంఘం అధ్యక్షుడు బిషప్ డాక్టర్ రెవరెండ్ జాన్సన్‌బాబు, పాస్టర్ ఆనంద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జోసెఫ్ కిశోర్ పర్యటించి స్వస్థత సభల పోస్టర్లను అందించి ఆహ్వానం పలికారు.

108లో మహిళ ప్రసవం

గుంతకల్లు రూరల్: నెలగొండ గ్రామానికి చెందిన మహిళ 108 వాహనంలో శిశువుకు జన్మనిచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన రాజశేఖర్, స్వాతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, ప్రస్తుతం ఆమె 9 నెలల గర్భంతో ఉంది. శుక్రవారం ఉదయం ఉన్నట్టుండి స్వాతికి పురుటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఆశావర్కర్ శివమ్మ 108 వాహనంలో ఆమెను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేందుకు యత్నించింది. పురుటినొప్పులు అధికం కావడంతో పైలట్ నాగరాజు, ఈఎంటీ అనిల్‌కుమార్ వాహనంలోనే సుఖ ప్రసవం చేశారు. అనంతరం ఆమెను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉచిత యోగా శిక్షణ సద్వినియోగం చేసుకోండి

అనంతపురం కల్చరల్: హార్ట్‌ఫుల్‌నెస్ యోగా సెంటర్, వివేకానంద యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23, 24,25 తేదీల్లో ఉచిత యోగా శిక్షణ అందిస్తున్నారు. ఈ మేరకు యోగా కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో యోగా సంస్థల ప్రతినిధులు రాజశేఖరరెడ్డి, మధుసూదన్ యోగా శిక్షణ వివరాలు అందించారు. బీపీ, మధుమేహం, ఒత్తిడి, ఊయకాయం, థైరాయిడ్ తదితర సమస్యలకు పరిష్కారమార్గాలను యోగాభ్యాసనం ద్వారా తెలుసుకోచ్చన్నారు. స్థానిక షిర్డీనగర్‌లోని యోగా కేంద్రంలో రోజూ ఉదయం 7.30 గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 9440288899లో సంప్రదించాలని కోరారు.

40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ

రాప్తాడు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 40శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన రాప్తాడులో ఆర్‌బీకేలో వేరుశనగ విత్తన పేర్లు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే విత్తన వేరుశనగ గ్రామాలకు చేరుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్‌ఏ సోనియా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వర స్వామి జయంతి

అనంతపురం కల్చరల్: శనేశ్వరస్వామి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో పురోహితులు హర్షశర్మ ఆధ్వర్యంలో తైలాభిషేకాలు, అలంకార సేవలు చేశారు. శారదానగర్‌లోని శ్రీశివబాలయోగి ఆశ్రమం, శివకోటి, శంకరమఠం తదితర చోట్ల శనేశ్వరస్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల్లో శనేశ్వర హోమం, తైలాభిషేకాలను భక్తులతోనే చేయించారు.

‘జగనన్నకు చెబుదాం’ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు

రాప్తాడు: జగనన్నకు చెబుదాంను విజయవంతం చేద్దామని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యక్రమంలో జగనన్నకు చెబుదాం, స్పందన వినతుల పరిష్కారాలపై సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. అర్జీదారుడికి సంతృప్తి కలిగేలా వినతులు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రత్నబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఆర్థిక పురోగతి



మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి

అనంతపురం క్రైం: నవరత్నాలతో మహిళలు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారని మెప్మా పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడు టీటీడీసీలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని పట్టణ, స్లమ్ సమాఖ్యల రీసోర్స్‌పర్సన్లకు నవరత్నాలు ఫ్లాగ్‌షిప్ సంక్షేమ కార్యక్రమాలపై రెండ్రోజుల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెప్మా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మఒడి, విద్యా, వసతి దీవెన పథకాలతో పిల్లలు ఉన్నతంగా చదివేందుకు దోహదపడుతోందన్నారు. చేయూత, ఆసరా, తదితర పథకాలతో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకొని ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారన్నారు. శనివారంతో శిక్షణ కార్యక్రమం ముగియనుందన్నారు. అనంతరం నవరత్నాల పథకాల అమలు, అర్హత తదితర వాటిపై 747 మంది ఆర్‌పీలకు జిల్లా రీసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు.

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



ఆత్మకూరులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ పోరాటాలు సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు.శుక్రవారం సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాలను స్థానిక గణేనాయక్ భవన్, మహదేవ్‌నగర్ కాలనీ, శ్రీశ్రీనగర్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాంభూపాల్ హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1964 నుంచి 1976 వరకు సీపీఎం ప్రధాన కార్యదర్శిగా సుందరయ్య బాధ్యతలు నిర్వహించారన్నారు. ఉద్యమమే ఊపిరిగా, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, ప్రకాశ్, వలి, మసూద్, బాబు, ప్రసాద్, ముస్కిన్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ సుందరయ్య నిస్వార్థ ప్రజా సేవకుడని, నిత్యం ప్రజల కోసం, కార్మికులు, రైతుల కోసం ఎనలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జయమ్మ, సరస్వతి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొంగల ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న షేక్ బాషా ఇంటిలో బుధవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగిన విషయం విదితమే. గుర్తు తెలియని దొంగలు సినీ ఫక్కీలో మిద్దెపై నిద్రిస్తున్న షేక్‌బాషా తల దిండు కింద ఉన్న ఇంటి తాళాలు తీసుకుని దర్జాగా తలుపులు తెరిచి ఇంటిలో ఉన్న సుమారు రూ.1 లక్ష విలువైన సిగరెట్లు, ఇంటి పక్కనే పార్క్ చేసిన వ్యాగనర్ కారును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, ఏఎస్ఐలు నాగమాణిక్యం, ఆజాద్, రామచంద్రారెడ్డి తదితరులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కారు ఎత్తుకెళుతున్న దృశ్యం సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. దొంగల ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

బుక్కరాయసముద్రం: పసులూరులో రెండు రోజుల అధికంగా అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన శివయ్య కుటుంబాన్ని తహసీల్దార్ మోహన్‌కుమార్, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి పరామర్శించారు. శివయ్య ఆత్మహత్యకు కారణాలను అతడి భార్య లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలంతా 10 ఏళ్లలోపువారే. పిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించి మంచి చదువులు చెప్పిస్తామని అధికారులు లక్ష్మికి భరోసా ఇచ్చారు. మృతుడు శివయ్య ఆత్మహత్యపై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. ప్రభుత్వం ద్వార శివయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. సర్పంచ్ కల్పన, పంచాయతీ సెక్రటరి రవికుమార్ రెడ్డి, వీఆర్‌ఓ శిల్పా, వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



ఫ్యాక్టరీలో ఎగిసిపడుతున్న మంటలు

తాడిపత్రి టౌన్: రావివెంకటాంపల్లి సమీపంలోని రబ్బర్ టైర్స్ షెడ్డింగ్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. టైర్లకు నిప్పు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. తాడిపత్రి, అనంతపురం, ఉరవకొండకు చెందిన ఐదు ఫైరింజన్లు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తాడిపత్రి ఫైర్‌ఆఫీసర్ మోహన్‌బాబు తెలిపారు. పాత టైర్లు, యంత్రాలు పూర్తి దెబ్బతిన్నాయని, నష్టం వివరాలు తెలియాల్సి ఉందని ఆయన తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- వీహెచ్‌పీఎస్ ధర్నాలో మందకృష్ణ



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

అనంతపురం అర్బన్: దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న (వీఎచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మందకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రధానంగా దివ్యాంగులకు ఇప్పడిస్తున్న రూ.3 వేలు పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలన్నారు. పేద దివ్యాంగులకు జగనన్న కాలనీల్లో స్థలం కేటాయించి ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. భూమిలేని పేద దివ్యాంగులకు ఐదు ఎకరాలు చొప్పున వ్యవసాయ భూమిని ఇవ్వాలన్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్, నాయకులు మధు, సూరప్ప, హరిగోపాల్, శివరుద్ర, జయమ్మ, రంగనాథ్, పుల్లయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు స్థానిక టవర్‌క్లాక్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. వేదిక జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, మానవతా సంస్థ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడారు. దేశం గర్వించదగ్గ పతకాలను సాధించిన మహిళా రెజ్లర్లపై సమాఖ్య అధ్యక్షుడు లైంగిక వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. అతన్ని శిక్షించాలంటూ కొద్ది రోజులుగా రెజ్లర్లు నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు సుబ్రమణ్యం, మహేష్, సురేష్, నాగముత్యాలు, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా తవ్వుకోండి



ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న దృశ్యం

యాడికి: డోలమైట్, బెరైటీస్ క్వారీల నిర్వాహకులు ప్రజలు, రైతులకు ఇబ్బంది కలిగించకుండా పనులు చేయించుకోవాలని డీఆర్వో గాయత్రి సూచించారు. చందన గ్రామ పరిధిలో 24.493 హెక్టార్ల డోలమైట్, బ్రైరైటీస్ తవ్వకానికి పఠాన్ టోపీఖాన్ కంపెనీ దరఖాస్తు చేసుకుంది. శుక్రవారం పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ మైనింగ్ వల్ల దుమ్ము రేగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రోజూ నీరు చల్లించాలని క్వారీ నిర్వాహకుడు టోపీఖాన్‌కు సూచించారు. క్వారీలకు సమీపంలోని చందన, పచ్చారుమేకలపల్లె, కేశవరాయుని పేట, దైవాలమడుగు గ్రామాల అభివృద్ధితో పాటు ఆయా గ్రామాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. పనులు చేసేటప్పుడు భద్రతా చర్యలతో పాటు నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. కాలుష్యనియంత్రణాధికారి శంకర్‌రావు, మైనింగ్ ఏడీ నాగయ్య, తహసీల్దార్ అలెగ్జాండర్, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, వీఆర్వో రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

యాడికి: రాయలచెరువు గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్నతోపాటు పైపులు దగ్ధమయ్యాయి. వివరాలు..గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఉలవల మధుసూదన్ నాయుడు పచ్చారుమేకలపల్లె రహదారిలోని తన పొలంలో మొక్కజొన్న కంకులు కోసి పొలంలోనే ఉంచాడు. శుక్రవారం సాయంత్రం సమీపంలోని ఓ రైతు మొక్కజొన్న సొప్పకు అగ్గి పెట్టాడు. దీంతో ఒక్కసారిగా అగ్గి మధుసూదనాయుడు పొలం గట్టుమీదికి వచ్చి మొక్కజొన్న కంకులతో పాటు పొలంలోని లాటరు, పైపులు కూడా అగ్గికి ఆహుతయ్యాయి. ఘటనలో రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రైతు జీవితం కళ్లకు కట్టిన ‘సేద్యం’ సినిమా

- ట్రైలర్‌ను విడుదల చేసిన డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి



రైతు సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం కల్చరల్: జిల్లా వాసులు నిర్మించిన సేద్యం సినిమా రైతు జీవితాన్ని కళ్లకు కట్టిందని పలువురు వక్తలు తెలిపారు. జిల్లావాసి చంద్రకాంత్ పసుపులేటి దర్శకత్వంలో మహేష్‌రెడ్డి, గాజుల పద్మావతి నిర్మించిన సేద్యం సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుక స్థానిక ఎస్వీ థియేటర్‌లో శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, సీనియర్ రచయిత డాక్టర్ శాంతి నారాయణ, సామాజిక సేవాకార్యకర్త అనిల్‌కుమార్‌రెడ్డి, సినీ నటుడు రమేష్‌నీల్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. వ్యవసాయంలోని సంక్షోభం, రైతుల ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితులపై చక్కగా నటించిన కళాకారులను అభినందించారు.

టీడీపీ హయాంలోనే ఆత్మహత్యలు :

భారత్ ప్రజారైతు సంక్షేమ సంఘం ప్రతినిధి కసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి రైతుల ఆత్మహత్యలను ప్రస్తావిస్తూ 2004కు ముందు టీడీపీ హయాంలో వందలాదిగా రైతుల ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. నాడు రైతు వ్యతిరేక ప్రభుత్వంగా టీడీపీ వ్యవహరించిందని, వ్యవసాయం దండగ అని చెప్పిందని, అయితే అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో వైఎస్సార్ నేతృత్వంలో దాదాపు వంద మందికి జోలెపట్టి చందాలు సేకరించి, బాధిత రైతు కుటుంబాలకు అందించామన్నారు. రైతు లేకపోతే లోకానికి అన్నమే లేదని, అలాంటి రైతుల దీన గాథలను అద్భుతంగా తెరకెక్కించిన చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులు చంద్రకాంత్, మహేష్ తదితరులు ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో చిత్ర నటీనటులు తరిమెల రాజు, విద్య , గౌతమ్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.